క్లుప్తంగా

'పది'లో విద్యార్థిని ప్రతిభ


మల్లీశ్వరి(504)

ఓర్వకల్లు: మండలంలోని శకునాల జెడ్పీ హైస్కూల్ పదో తరగతి విద్యార్థి బ్రాహ్మణపల్లె కొప్పర్ల మల్లీశ్వరి 504 మార్కులు సాధించి స్కూల్ టాపర్‌గా నిలిచింది. తల్లితండ్రులు వ్యవసాయ కూలీ పనులకు వెళ్లి, తమ కూతురిని చదివించారు. వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా విద్యార్థిని అత్యుత్తమ మార్కులు సాధించడంతో తల్లితండ్రులతో పాటు, గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. పాఠశాల హెచ్‌ఎం ఆదినారాయణ, ఉపాధ్యాయులు మల్లీశ్వరిని అభినందించారు.

కౌలు కార్డులతో ప్రయోజనం

సి.బెళగల్: కౌలు కార్డులతో ప్రయోజనాలు ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి మల్లేష్‌కుమార్ తెలిపారు. సోమవారం ఆయన 1, 2 సచివాలయాలలో రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఏఓ కౌలు కార్డులపై అవగాహన కల్పించారు. ఇతరుల భూములను కౌలుకు తీసుకున్న రైతులు కౌలు కార్డులు తీసుకోవాలన్నారు. కార్డు ఉంటే ప్రభుత్వ వ్యవసాయ పథకాలకు అర్హులన్నారు. ఈ కార్డు వల్ల భూ యజమానికి ఎలాంటి నష్టం ఉండదన్నారు. సమావేశంలో వీఆర్వోలు శేఖర్, నాగమ్మ, సర్పంచ్ పాండురంగన్న పాల్గొన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే గుర్తింపు రద్దు

కోడుమూరు రూరల్: అధిక ధరలకు విత్తనాలను విక్రయించే దుకాణాల గుర్తింపును రద్దు చేసి సీజ్ చేస్తామని మండల వ్యవసాయాధికారి రవిప్రకాష్ హెచ్చరించారు. స్థానిక విత్తన, పురుగు మందులు, ఎరువుల దుకాణాల్లో సోమవారం ఏఓ రవిప్రకాష్ తనిఖీలు నిర్వహించారు. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓమాట్లాడుతూ రైతులు కొన్న ప్రతి వాటికి తప్పనిసరిగా రసీదు ఇవ్వాలన్నారు.

ఉపాధి పనులపై గ్రామ సభలు

కర్నూలు (న్యూటౌన్): మండలంలోని శివరాంపురం, పసుపల, దిన్నెదేవరపాడు, రుద్రవరం గ్రామాల్లో సోమవారం ఉపాధి పనులపై గ్రామ సభలు నిర్వహించారు. సోషల్ ఆడిట్ టీమ్ సభ్యులు ఆయా గ్రామాల్లో జరిగిన ఉపాధి పనులపై ఆరా తీసి వివరాలు సేకరించారు. కార్యక్రమంలో సోషల్ ఆడిట్ డిస్ట్రిక్ట్ రిసోర్స్ పర్సన్స్ రవి, గణేష్‌కుమార్, టి.రవికుమార్, జి భగవాన్ పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌కు దరఖాస్తు చేసుకోండి

కోడుమూరు రూరల్: మోడల్ స్కూల్‌లో 6వ తరగతి ప్రవేశాలకు ఈనెల 9వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఆశాజ్యోతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.150, ఎస్సీ, ఎస్టీలు రూ.75 ఫీజు ఉందన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని ప్రింట్ తీసుకుని 25వ తేదీలోగా మోడల్ స్కూల్‌లో సమర్పించాలన్నారు. జూన్ 11న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు


గడివేముల ఎస్సీ కాలనీలో చెత్తను తొలగిస్తున్న దృశ్యం

గడివేముల: మండలంలోని అన్ని గ్రామాల్లో పారిశుధ్య పనులు చేయిస్తున్నట్లు ఈఓపీఆర్‌డీ అబ్దుల్‌ఖాలిక్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో పారిశుధ్య సిబ్బంది చెత్తను తొలగించారు. గడివేములలోని ఎస్సీ కాలనీ, హాస్పిటల్ వద్ద మురుగు కాలువలో పేరుకుపోయిన చెత్తను తొలగించారు. అనంతరం బ్లీచింగ్ పౌడర్ చల్లారు.

సుంకేసులకు 550 క్యూసెక్కుల ఇన్ ఫ్లో

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్‌కు 550 క్యూసెక్కుల నీటి ఇన్ ఫ్లో ఉంది. కర్నూలు నగర ప్రజల తాగునీటి అవసరాల నిమిత్తం కేసీ కాల్వకు 331 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. డ్యాంలో 1.152 టీఎంసీల నీరు నిల్వ ఉందని అధికారులు తెలిపారు.

అన్నసత్రం కమిటీ ఎన్నిక

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో ఉన్న ఆర్యవైశ్య అన్నసత్రం నూతన కమిటీని నిర్వాహకులు సోమవారం ఎన్నుకున్నారు. శ్రీవల్లి దేవసేవ సుబ్రమణ్యేశ్వరస్వామి ఆర్య వైశ్య అన్నసత్రం అధ్యక్షుడిగా నెరవాటి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా కురాకు రాజశేఖర్, కోశాధికారిగా రాచమడుగు వెంకటసుబ్బయ్యను ఎన్నుకుని, వారిచేత ప్రయాణస్వీకారం చేయించినట్లు నిర్వాహకులు తెలిపారు.

శిక్షణకు వైద్యాధికారులు

కర్నూలు(హాస్పిటల్): విజయవాడలో ఈ నెల 10, 11వ తేదీల్లో నిర్వహించనున్న వృత్తిపర శిక్షణకు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ జి. నరేంద్రనాథ్‌రెడ్డి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి, సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ బి.వెంకటేశ్వరరావు, కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ పి.సుధాకర్, వైస్ ప్రిన్సిపాల్స్, ఏడీలు వెళ్లనున్నారు. వీరికి ఆసుపత్రి, కళాశాలల్లో పరిపాలనకు సంబంధించి శిక్షణ ఇవ్వనున్నట్లు అధికారులు తెలిపారు.

అన్ని వర్గాల సంక్షేమం జగనన్నతోనే సాధ్యం

● కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్


లబ్ధిదారులకు సంక్షేమ క్యాలెండర్‌ను అందజేస్తున్న కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కర్నూలు (న్యూటౌన్): అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, అభివృద్ధి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆయన సోమవారం కర్నూలు మండలం పసుపల గ్రామంలో పర్యటించారు. ఇంటింటికి వెళ్లి పథకాల అమలు తీరుపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. నాలుగేళ్లలో ప్రభుత్వం ద్వారా పొందిన లబ్ధిని వివరిస్తూ సంక్షేమ క్యాలెండర్‌ను అందజేశారు. గ్రామంలో ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మన రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు చేస్తూ దేశానికే మార్గదర్శకమయ్యారన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి పేదవాడికి ప్రభుత్వ పథకాలు అందిస్తున్న జగనన్నకు అండగా ఉండి మరో సారి ముఖ్యమంత్రిని చేసుకుందామన్నారు. కార్యక్రమంలో కర్నూలు ఎంపీపీ వెంకటేశ్వరమ్మ, వైస్ ఎంపీపీ2 నెహేమ్యా, జెడ్పీటీసీలు ప్రసన్నకుమార్, గిరిజోన్, మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ మహబూబ్‌బాషా, మండల మాజీ ఉపాధ్యక్షులు వాసు, సచివాలయ కన్వీనర్ శేఖర్, పసుపల సొసైటీ చైర్మన్ శేషిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి హేమంత్‌కుమార్‌రెడ్డి, ఉల్చాల సర్పంచ్ విద్యాసాగర్ ల్గొన్నారు.

నేడు కూడా..

కర్నూలు మండలం పసుపల గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం కూడా కొనసాగనున్నట్లు ఎంపీడీఓ ఎస్ భాస్కర్ నాయుడు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ హాజరుకానున్న ఈ కార్యక్రమానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తప్పకుండా హాజరు కావాలన్నారు.

నేటి నుంచి రైతులకు అవగాహన సదస్సులు

ఓర్వకల్లు: మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో మంగళవాం నుంచి గుర్తింపు కార్డుల జారీ, అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి సుధాకర్ తెలిపారు. 9న ఓర్వకల్లు, కన్నమడకల, హుసేనాపురం 1, 2 రైతు భరోసా కేంద్రాల్లో, 10న కాల్వ 1, 2 ఆర్బీకేల్లో, 11న శకునాల, బ్రాహ్మణపల్లె, 12న సోమయాజుల పల్లె, కొమరోలు, 15న గుట్టపాడు, పూడిచెర్ల, 16న నన్నూరు 1, 2, 3 కేంద్రాల్లో, 17న లొద్దిపల్లె, మీదివేముల, 18న ఉప్పలపాడు, ఉయ్యాలవాడ ఆర్బీకేల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. రైతులు సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం

కర్నూలు కల్చరల్: వీహెచ్‌పీ – మాతృ శక్తి విభాగం ఆధ్వర్యంలో 1వ తేదీ నుంచి శరీన్ నగర్ సద్గురు త్యాగరాజ సీతారామాలయం కల్యాణ మండపంలో నిర్వహించి వేసవి శిక్షణ శిబిరం సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షులు గోరంట్ల రమణ, వీహెచ్‌పీ మాతృ శక్తి జిల్లా కన్వీనర్ రాధిక మాట్లాడుతూ సనాతన హైందవ ధర్మాన్ని బోధించడానికే బాలలకు వేసవి శిక్షణా శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. ఏ ధర్మమైనా చిరకాలం వర్ధిల్లాలంటే చిన్నప్పటి నుంచే అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. శిక్షణా శిబిరంలో నేర్చుకున్న అంశాలను విద్యార్థులు ప్రదర్శించి అలరించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి భానుప్రకాష్, నగర అధ్యక్షులు టీసీ మద్దిలేటి, నగర కార్యదర్శి ఈపూరి నాగరాజు, మాతృ శక్తి నగర కన్వీనర్ భార్గవి, సభ్యులు ప్రవీణ్, రాజేశ్వరి, సహస్ర పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

సి.బెళగల్: రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. అంతకుముందు షాపింగ్ కాంప్లెక్స్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుభరోసా, సున్నా వడ్డీ రుణాలు, ఆర్బీకేల ఏర్పాటు చేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వ్యవసాయరంగానికి పెద్దపీట వేస్తున్నారన్నారు. అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందుతుండటంతో ప్రజల మద్దతు చూసి ప్రతిపక్ష పార్టీల నాయకులు ఓర్వలేక లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఉనికి కాపాడుకునే ప్రయత్నం తప్ప ఆరోపణల్లో నిజం లేదన్నారు. టీడీపీ నాయకులు చంద్రబాబు, లోకేష్ చేస్తున్న యాత్ర వల్ల ఒరిగేదేం లేదన్నారు. అధికారంలో ఉన్నప్పుడు, అధికారంలోకి వస్తే ఏమి చేస్తారో చెప్పకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, ఎమ్మెల్యేలను తిట్టడమే పనిగా పెట్టుకోవడం సిగ్గుచేటన్నారు. కాగా శిలాఫలకంలో ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యుడు, స్థానిక సర్పంచ్, ఎంపీటీసీ సభ్యుల పేర్లు లేకపోవడంపై ఎంపీపీ బొంతల మునెప్ప, గ్రామ సర్పంచ్ పాండురంగన్న అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్ గోపాల్ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు గిరిజోను, కేడీసీసీ బ్యాంక్ సీఈఓ రామాంజనేయులు, డీసీఓ రామాంజనేయులు, ఏపీసీఓబీ డీజీఎం విజయ్‌కుమార్, ఏజీఎం డీపీడీఎం భరద్వాజ్‌శర్మ, డీజీఎం సునీల్‌కుమార్, సింగల్‌విండో మాజీ అధ్యక్షుడు సీబీ గోవింద రెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, ఎస్ఎం బాషా, వెంకటేష్, మద్దిలేటి, జీసీఎస్ సీబీ తులసిరెడ్డి పాల్గొన్నారు.


షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

ఎప్పటికప్పుడు పరిష్కారం చూపండి


సమస్యను తెలుసుకుంటున్న అధికారులు

సి.బెళగల్: స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలకు ఎప్పటి కప్పుడే పరిష్కారం చూపాలని తహసీల్దార్ శివశంకర్‌నాయక్ అధికారులకు సూచించారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో ఎంపీడీఓ రాముడు, మండల అధికారులతో కలిసి స్పందనను నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. జలకల బోర్లు, భూ సమస్యలు, తాగునీరు, మురుగు కాలువలు, ఇంటి పట్టాలు తదితర సమస్యలపై ప్రజలు వినతులు అందాయని తహసీల్దార్ తెలిపారు. వీటినంత త్వరగా పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈఓఆర్డీ సందీప్, ఎంఈఓ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

● కోడుమూరు రూరల్: భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ శేషఫణి.. వీఆర్వోలను ఆదేశించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల అధికారులు స్పందన కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడారు. స్పందన కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రశేఖర్, ఏఓ రవిప్రకాష్, హెచ్ఓ మదన్‌మోహన్, ఎంఈఓ అనంతయ్య తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాలు మెరుగుపరుచుకోండి


క్యాంప్‌ను ప్రారంభిస్తున్న ఎంఈఓ కోటయ్య


దిన పత్రికలు, పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

పాణ్యం: నైపుణ్యాలు మెరుగుపరుచుకోవాలని ఎంఈఓ కోటయ్య విద్యార్థులకు సూచించారు. సోమవార స్థానిక గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన వేసవి శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఎంఈఓ మాట్లాడుతూ సాంకేతిక విద్య, క్రీడలు, దినపత్రికలు, కథల పుస్తకాలు, కిడ్స్ పుస్తకాలు, బొమ్మల పుస్తకాలు అందుబాటులో ఉంచామని సెలవుల్లో విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తలసీమియా పట్ల అవగాహన పెంచాలి


కార్యక్రమంలో పాల్గొన్న వైద్యులు

కర్నూలు(హాస్పిటల్): తలసీమియా వ్యాధి పట్ల పిల్లల తల్లిదండ్రులకు అవగాహన పెంచాలని ఫెడరేషన్ ఆఫ్ గైనిక్ సొసైటీ ఆఫ్ ఇండియా(ఫాగ్సి) కర్నూలు ప్రెసిడెంట్ డాక్టర్ వెంకటరమణ, పీడియాట్రిక్స్ అసోసియేషన్ కర్నూలు అధ్యక్షులు డాక్టర్ విజయానందబాబు చెప్పారు. వరల్డ్ తలసీమియా డే సందర్భంగా సోమవారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని గైనిక్ విభాగంలో గర్భిణులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తలసీమియా జన్యుపరమైన వ్యాధి అని, దంపతులు వివాహానికి ముందే అవసరమైన పరీక్షలు చేయించుకుంటే మేలన్నారు. ఇందులో తలసీమియా క్యారియర్స్‌గా ఇద్దరూ ఉంటే వారికి జన్మించే పిల్లలకూ వ్యాధి వస్తుందన్నారు. ఇలాంటి వారు పెళ్లి చేసుకోకూడదన్నారు. అలాగే మేనరికపు వివాహాల వల్ల కూడా తలసీమియా వస్తుందని, మేనరికపు వివాహాలు చేసుకోకూడదని తెలిపారు. కార్యక్రమంలో గైనకాలజిస్టులు డాక్టర్ శ్రీలక్ష్మి, డాక్టర్ ఎ.సుధారాణి, డాక్టర్ సుజాత, డాక్టర్ ప్రియాంక, పీడియాట్రిక్స్ అసోసియేషన్ కార్యదర్శి డాక్టర్ రత్నాకర్‌రెడ్డి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మల్లికార్జున పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన శిబిరాలు ప్రారంభం


ఓర్వకల్లులో పుస్తక పఠనం నేర్పిస్తున్న దృశ్యం

ఓర్వకల్లు: మండలంలోని ఓర్వకల్లు, నన్నూరు శాఖా గ్రంథాలయాలలో 'వేసవి విజ్ఞాన శిబిరాలను' సోమవారం ప్రారంభించారు. ఆయా శాఖల గ్రంథాలయాధికారులు హనుమే నాయక్, జీవీ కృష్ణారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు వేసవి సెలవులను వృథా చేయకుండా ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ నెల 8 నుంచి జూన్ 11వ తేదీ వరకు ప్రతి రోజు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వేసవి విజ్ఞాన శిబిరాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పుస్తక పఠనం, కథలు, పుస్తక సమీక్షలు, చిత్రలేఖనం, ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఆర్‌పీ నాగమద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

'స్పందన' సమస్యల పరిష్కారానికి కృషి


స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్

కర్నూలు (టౌన్): స్పందన సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించనున్నట్లు నగర పాలక అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్ అన్నారు. సోమవారం స్థానిక నగరపాలక కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. అర్జీదారుల నుంచి అడిషనల్ కమిషనర్ దరఖాస్తులు స్వీకరించారు. త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. స్పందనలో మున్సిపల్ ఇంజినీరింగ్ ఎస్ఈ వేణుగోపాల్, అడిషనల్ సిటీ ప్లానర్ రంగస్వామి, మేనేజర్ చిన్నరాముడు పాల్గొన్నారు.

సమస్యలివే..

➡ సరైన మురుగు నీటి వ్యవస్థ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నట్లు లక్ష్మీనగర్‌కు చెందిన శ్రీనివాసులు, విజయనగర కాలనీకి చెందిన మున్నా సాహెబ్ విన్నవించారు.

➡ అశోక్ నగర్ పాలకొట్టాల లైన్‌లో రోడ్డు ఇరువైపులా ఆక్రమణలు ఉన్నాయని, దీని వల్ల వాహనాల రాకపోకలకు ఇబ్బందులు వస్తున్నాయని అదే కాలనీకి చెందిన రంగస్వామి విన్నవించారు.

➡ తమ ప్లాటుకు ఆనుకుని ట్రాన్స్‌ఫార్మర్ ఉందని, దీని వల్ల నిత్యం ఆందోళనకు గురవుతున్నామని ఇందిరమ్మ గృహాలకు చెందిన శైలజా బాయి విన్నవించారు.

➡ తమ కాలనీలో తాగునీటి, డ్రైనేజీ వ్యవస్థ లేదని తుంగభద్ర కాలనీకి చెందిన రవికాంత్ విన్నవించారు.

➡ తమ కాలనీలోని వీవీఎస్ ఫంక్షన్ హాలు సమీపంలో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగు నీటి, దోమల సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని 29వ వార్డు విజయనగర్ కాలనీకి చెందిన రామిరెడ్డి కాలనీ వాసులు అర్జీ ఇచ్చారు.

➡ టిడ్కో ఇంటి కోసం ప్రభుత్వం నిర్ణయించిన రుణం చెల్లించా. ఇప్పుడు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నా. తాను చెల్లించిన రుణం వాపస్ ఇవ్వాలని స్టాంటన్‌పురానికి చెందిన హఫీజా అభ్యర్థించారు.

నిరూపిస్తే రెట్టింపు డబ్బు చెల్లిస్తా

● ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: ఎస్ఆర్‌బీసీ కెనాల్, మీదివేముల గ్రామాల్లో రైతుల నుంచి డబ్బు తీసుకున్నట్లు లోకేష్ నిరూపిస్తే అంతకు రెట్టింపు డబ్బు ఇస్తానని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సవాల్ విసిరారు. సోమవారం రాత్రి ఎమ్మెల్యే తన స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. తనపై టీడీపీ నాయకుడు నారా లోకేష్ అసత్య ఆరోపణలు చేశారన్నారు. కర్నూలు టౌన్ దాటిలోపు ఎక్కడికి రమ్మంటే అక్కడికి వస్తానని, అవసరమైతే పోలీసు అధికారులతో మాట్లాడి చర్చావేదిక ఏర్పాటు చేస్తానని తనపై చేసిన ఆరోపణలను మాత్రం రుజువు చేయాలని డిమాండ్ చేశారు. లక్ష్మీపురం పరిధిలోని 789 సర్వే నంబర్‌లో ఉన్న భూమిని గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే ఇద్దరు వ్యక్తులు అప్పటి తహసీల్దార్ సంతకంతో మాజీ సైనికుల పేరుతో ఆన్‌లైన్‌లో ఎక్కించుకున్నారన్నారు. ఇదే విషయాన్ని 2016లో అప్పటి తహసీల్దార్ గుర్తించి రద్దు చేయాలని ఆర్డీఓకు రాశారన్నారు. 2018లో అప్పటి ఆర్డీఓ తన పరిధిలో లేదని జాయింట్ కలెక్టర్‌కు రాశారన్నారు. వీటితో తనకు మాత్రం ఎలాంటి సంబంధం లేదని ఎమ్మెల్యే తెలిపారు. కొందరు టీడీపీ నాయకులు కర్నూలు నగరంలోని ప్లాట్లను డబుల్ రిజిస్ట్రేషన్లు చేసిన ఘటనలు చాలా ఉన్నాయని, బాధితులు తన వద్దకు వచ్చి తమ గోడును వెళ్లబోసుకుంటున్నారని చెప్పారు. ముజఫర్ నగర్‌లోని వక్ఫ్‌బోర్డుకు చెందిన 10.64 ఎకరాల్లో 2016లో టీడీపీ హయాంలో కేవలం 3.24 ఎకరాలను వనం–మనం కార్యక్రమంలో చేర్చారన్నారు. మిగతా భూమిలో అప్పటికే వెంచర్లు వేసి అమ్ముకున్నందుకే వనం – మనం కార్యక్రమంలో చూపలేకపోయారని ఆరోపించారు.

నేటి నుంచి చెన్నకేశవస్వామి ప్రతిష్ఠోత్సవాలు

ఓర్వకల్లు: మండలంలోని కన్నమడకల గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీదేవి, భూదేవి సహిత చెన్నకేశవస్వామి దేవస్థానం వద్ద విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు మంగళవారం నుంచి నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు శ్రీనివాసులు తెలిపారు. సమరసతా సేవా ఫౌండేషన్ ఆర్థిక సౌజన్యంతో నిర్మించిన ఆలయ నిర్మాణంలో విగ్రహాలను ప్రతిష్ఠించనున్నట్లు తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే కార్యక్రమంలో భాగంగా 9 న(మంగళవారం) ఉదయం శ్రీరంగధామ పారాయణం వారిచే విష్ణుసహస్ర పారాయణం, యాగమండప ప్రవేశం, గణపతి పూజ, పుణ్యాహవాచనం, ఋత్విక్‌కరణము, మంటపారాధన, సాయంత్రం బలిహోమం, ధాన్యాధివాసం, జలాధివాసం పూజలు ఉంటాయన్నారు. 10 న భింభశుద్ధి, చెన్నకేశవ జపము, నవగ్రహ జపాలు, హోమము, తీర్థప్రసాద వితరణ, సాయంత్రం బలిహోమం, ధాన్యాధివాసం, శయ్యాధివాసం పూజలు నిర్వహిస్తారు. 11న విష్ణుసహస్రనామ పారాయణం, యంత్రప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజప్రతిష్ఠ, ఉదయం 10 గంటలకు మహా పూర్ణాహుతి తీర్థ ప్రసాద వితరణ, అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు.

'చిన్మయ ప్రభావళి' ప్రారంభం

కర్నూలు కల్చరల్: కర్నూలు వీఆర్ కాలనీలో చిన్మయ మిషన్ నూతన భవనం 'చిన్మయ ప్రభావళి'ని ప్రారంభించారు. సోమవారం వీఆర్ కాలనీలో మిషన్ కేంద్రంలో చిన్మయానంద మహరాజ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేద పండితులు గో పూజ, కలశ పూజ, గణపతి పూజ, పుణ్యాహవచనం, రుద్రాభిషేకం,గురుపాదుకా పూజలు నిర్వహించారు. చిన్మయ మిషన్ బాధ్యులు స్వామిని సుప్రేమానంద సందేశమిచ్చారు. ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలన్నారు. నిత్యం భగవద్గీత పఠనం, శ్రవణం చేయాలన్నారు. కార్యక్రమంలో మిషన్ సభ్యులు గురవయ్య శెట్టి, రత్నప్రసాద్, శ్రీనివాస్, జగదీష్, బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభం రోజే విద్యాకానుక కిట్లు


గ్లాసులను హెచ్‌ఎంలకు అంజేస్తున్న ఎంఈఓ రామక్రిష్ణుడు

గడివేముల: ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభం రోజునే విద్యార్థులకు విద్యా కానుల కిట్లు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎంఈఓ రామక్రిష్ణుడు తెలిపారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. పాఠశాలల్లో జరుగుతున్న నాడు–నేడు పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. పనులను త్వరగా పూర్తి చేయించాలన్నారు. జగనన్న విద్యాకానులలో భాగంగా మొదటి విడతగా 12,624 పుస్తకాలు వచ్చాయన్నారు. 3,743 మంది విద్యార్థులకు యూనిఫాం, 3,666 స్టీల్ గ్లాసులు వచ్చాయన్నారు. వాటిని మొదటి రోజే విద్యార్థులకు అందజేస్తామన్నారు. సమావేశంలో పీఆర్ డీఈ గంగాధర్, ఏఈ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత సీట్లకు దరఖాస్తు చేసుకోండి

ప్రభుత్వం ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం ఉచిత సీట్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంఈఓ రామక్రిష్ణుడు తెలిపారు. 2023–2024 విద్యాసంవత్సరానికి గానూ ఒకటో తరగతిలో చేరేందుకు ఈనెల 15వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

కర్నూలు రెడ్‌క్రాస్‌కు గవర్నర్ ప్రశంస


గవర్నర్ నజీర్ అహ్మద్‌తో రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ డాక్టర్ కేజీ గోవిందరెడ్డి

కర్నూలు(హాస్పిటల్): అంతర్జాతీయ రెడ్‌క్రాస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడలోని రాజ్ భవన్‌లో రెడ్‌క్రాస్ ప్రతినిధులను రాష్ట్ర గవర్నర్ నజీర్ అహ్మద్ కలిశారు. ఈ సందర్భంగా ఆయన కర్నూలు జిల్లాలో రెడ్‌క్రాస్ సేవలను తెలుసుకుని జిల్లా చైర్మన్ డాక్టర్ కేజీ గోవిందరెడ్డిని ప్రశంసించారు. రాష్ట్రంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీకి స్వచ్ఛందంగా విరాళాలు ఇచ్చిన 11 మందికి గవర్నర్ చేతుల మీదుగా బంగారుపతకాలు ప్రదానం చేశారు. ఈ సంస్థల్లో హైదరాబాద్‌కు చెందిన విర్చోదా ఫౌండేషన్ వారు రూ.35 లక్షలతో సింగిల్ డోనార్ ప్లేట్‌లెట్ మిషన్‌ను ఇటీవల అందజేశారు.

యుఎస్ 7067 బీటీ పత్తి విత్తన ప్యాకెట్లు స్వాధీనం


మంజునాథ ట్రేడర్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న ఏడీఏ సాలురెడ్డి

కర్నూలు(అగ్రికల్చర్): యుఎస్ 7067 బీటీ పత్తి విత్తన ప్యాకెట్ల వ్యవసాయ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం కర్నూలు ఏడీఏ సాలురెడ్డి కల్లూరు టెక్నికల్ ఏఓ దస్తగిరిరెడ్డితో కలిసి కొత్త బస్టాండు సమీపంలోని మంజునాథ ట్రేడర్‌లో తనిఖీలు నిర్వహించారు. యుఎస్ అగ్రి 7067 రకం బీటీ పత్తి విత్తన ప్యాకెట్లను బ్లాక్‌లో విక్రయిస్తున్నట్లు గుర్తించారు. ఈ డీలరు ఎమ్మిగనూరు, కర్నూలులోని డిస్ట్రిబ్యూటర్ల నుంచి యుఎస్ 7067 రకం బీటీ పత్తి విత్తన ప్యాకెట్లు 900 తెచ్చుకొని బ్లాక్‌లో విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. ఎమ్మార్పీ రూ.853 ఉండగా రూ.1,150 ప్రకారం 716 ప్యాకెట్లు విక్రయించినట్లు తనిఖీల్లో ఏడీఏ గుర్తించారు. ఈ రకానికి డిమాండ్ ఉండటంతో జిల్లా వ్యాప్తంగా బ్లాక్‌లో అమ్మకాలు సాగుతున్నట్లు తెలుస్తోంది. అయితే బిల్లులు మాత్రం రూ.853కే వేయడం గమనార్హం. మిగిలిన 184 ప్యాకెట్లు సీజ్ చేశారు. రాష్ట్రంలో కో–మార్కెటింగ్ లేకపోయినా ఆద్యా కంపెనీకి చెందిన కోమలి, స్వాతి రకాలను నిబంధనలకు విరుద్ధంగా 400 ప్యాకెట్లు తెచ్చుకొని ఇప్పటికే 40 ప్యాకెట్లు విక్రయించినట్లు గుర్తించారు. మిగిలిన 360 ప్యాకెట్లు సీజ్ చేశారు. రూ.4,64,032 విలువ కలిగిన మొత్తం 544 ప్యాకెట్లు సీజ్ చేసి, డీలరుపై 6ఏ కేసు నమోదు చేసి విచారణ జరపాలని కల్లూరు ఏఓ శ్రీనివాసరెడ్డిని ఆదేశించినట్లు ఏడీఏ తెలిపారు.

రైతులకు సరైన పరిహారం ఇవ్వాలి

కర్నూలు(సెంట్రల్): చెన్నై–సూరత్ జాతీయ రహదారి కోసం భూములు ఇస్తున్న రైతులకు సరైన పరిహారం ఇవ్వాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం రైతులకు న్యాయం చేయాలని కోరుతూ ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో కర్నూలు ఆర్డీఓ, తహసీల్దార్లకు వినతిపత్రాలు ఇచ్చారు. అనంతరం బాధిత రైతులతో కలిసి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. .